
కథ


# ఓహో! అదా సంగతి

అవసరాల రామకృష్ణారావు



"ఏమో గాని మునుపటి చురుకుదనం నీలో కనిపించడం లేదు నాన్నా!"

అనే మా అమ్మాయి వైదేహి వైపు తెల్లబోయి చూశాను. నిండా నలభై ఏళ్లు లేవు. స్కూలు నుంచి వస్తున్నప్పుడే కాదు, వెడుతున్నప్పుడు కూడా దాని మొహాన ఉసూరు మనడం తప్ప హుషారు అనేది చూసి ఎరగను. ఇదా నన్ను నిలదీయడం!




''అమ్మలేని శూన్యం అరాయించుకోలేక పోతున్నావా నాన్నా!'' అనే అదనపు పరామర్శ ఒకటీ!

మా ఆవిడ పార్వతి తద్దినం కూడా పెట్టేసి ఆర్నెల్లు దాటింది. చావు అనేది చెప్పలేనిదే కాదు. చెప్పిరానిది! ఆ ముందురోజు రాత్రి సంతృప్తిగా శృంగారం అందించిన ఏభై ఎనిమిదేళ్ల ఇల్లాలు, మర్నాడు ఉదయం పదిగంటలు దాటకుండా మాసివ్ హార్టెటాక్ పేరున అంబులెన్స్‌లోనే కన్ను మూస్తుందని ఎవరనుకుంటారు! అరాయించుకుని అలవాటు పడకపోతే, మొండిగా ముందడుగు వెయ్యకపోతే, ఉన్నవాళ్లు ఏం కావాలిట? వెలితికి సవతే వుండదు, లోటుకి పూటూ కుదరదు. ఎలాంటి జబ్బులకైనా కాలమే డాక్టరు. తిప్పక తప్పదు చాప్టరు!

వైదేహి ఒక్కర్తే మా ఏకైక సంతానం. ఈ వయసులో నేనొంటరిగా ఏమై పోతానో అని దాని భయం. మా అల్లుడు పనిచేస్తున్న ఊరికి నన్ను ఏకంగా తీసుకుపోయి నా మంచి చెడూ చూద్దామని ఎంతో ప్రయత్నించింది. సొంత ఇంటి నుంచీ, అలవాటు పడిన ఊరి నుంచీ, కదలడానికి నేను ఒప్పుకోలేదు. అల్లుడు నాగభూషణంతో హోరాహోరీ పోరాడి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వచ్చి అంతా ఎనిమిది నెలలయింది. వాళ్లే ఇక్కడికి వచ్చి నాతో వుంటున్నారు. మనవడు మురళిని వైదేహి స్కూల్లో చేర్పించడంతో పాటు మా వైదేహి కూడా ఏదో టీచరు పోస్టు ఖాళీ వస్తే ఇక్కడే జాయినయింది.

తమాషా ఏమిటంటే నాకేదో సహాయంగా వుందామని నా దగ్గిర చేరిన వీళ్ల ముగ్గురికీ నా తోడే అత్యవసరం కావడం! ఏ వయసులోనైనా చేతనైన పని స్వయంగా చేసుకోవడంలోనే ఆరోగ్యం, ఆనందం వుందని మా తరం వాళ్ల నమ్మకం. ఇప్పటికీ ఎంత దూరమైనా సైకిలు తొక్కుతూ వెళ్లడమే నాకిష్టం. అల్లుడు కారులోకి రమ్మన్నా, అమ్మాయి తన స్కూటరు వెనుక కూచోమన్నా నాకు ఇబ్బందిగానే వుంటుంది. చదువుకుంటున్నప్పుడు తప్ప కళ్లజోడు వాడను. ఇంట్లో వాళ్లకే కాదు. పై వాళ్లకీ చిన్న చిన్న సహాయాలు చెయ్యడం నాకిష్టం. పెద్దగా తోచదని బాధ లేదు. పత్రికలున్నాయి. ఫ్రెండ్సున్నారు. టీవీ వుండనే వుంది. మన సాయం అందుకునే మనుషులు దొరకడం కూడా అదృష్టమే కదా!

మనుషులొక్కటే కాదండోయ్, నా సహకారం ఆశించిందని నేను భ్రమపడుతున్న మరో ప్రాణి కూడా చేరింది మాతో. నాకు మార్గదర్శిగా నిలిచిన ఆ మూగప్రాణి పేరు ఫ్లూటో. ఆ మగ కుక్క కూడా మా వాళ్లతో మా ఇంట చేరింది మరి.

ఈనాటి ఏ తల్లిదండ్రులకైనా ఏకైక ఆదర్శం ఎంతో అంత సంపాదించి పడెయ్యడమే కదా! ఆ పోటీ తత్వంలో పిల్లల్ని కూడా దింపకుండా వాళ్ల మటుకు వాళ్లని బతకనివ్వరు కదా! అందుకే మా మురళికి స్కూలు రోలు కాక రెండు పూటలా ట్యూషన్ మద్దెల వాయింపు తప్పింది కాదు. అంటే ఇల్లు ఇరవై నాలుగ్గంటలూ కనిపెట్టుకు వుండడానికి ఇప్పుడు ఇద్దరం వాచ్ డాగ్స్‌మి అన్నమాట! మా ఇద్దర్లో మళ్లా ఎవరెక్కువ సేవ చేస్తున్నామో తేలే విషయం కాదు!

మా ఫ్లూటోని రెండు పూటలా 'అకాల కృత్యాలకి' తిప్పి తీసుకు రావడం, గుడ్డూ అన్నం పెట్టడం, వెటర్నటీ హాస్పిటలుకి తీసుకెళ్లి ఇంజక్షన్లు ఇప్పించడం, పొరపాటున అది ఎవర్నైనా కరిస్తే వాళ్లకి ఇంజక్షన్లు ఇప్పించడం ఇదంతా నాకు ఇష్టమైన శ్రమే కదా! ఇంత చేసినా ఎంతరాత్రయినా మా అమ్మాయో, అల్లుడో ఇల్లు చేరీచేరగానే అల్లంత దూరం నుంచే పరిగెత్తుకు వెళ్లి నా దగ్గరకంటే ఎక్కువ స్పీడుగా తోకాడిస్తూ స్వాగతం పలుకుతుంది దొంగ పీనుగ!

ఇంట్లో ఇల్లూడ్చి, గిన్నెలు తోమి, బట్టలుతికే దాసీ పిల్లకాక, రెండు పూటలా వండి వార్చే ఏభై ఏళ్ల కామాక్షమ్మ కూడా వుంది. ఇంకా పై పనులేం వుంటాయనుకుంటారేమో చిల్లర పనులకి సిగ్గులేదని సామెత. నవనాగరిక యాంత్రిక జీవనంలో సహ మనిషి చేసేది తక్కువేం లేదు. కూరలూ, సరుకులూ తేవడం, బిల్లులు కట్టడం, బ్యాంకు పనులు చక్కబెట్టడం, టెలిఫోన్ కాల్సు రిసీవ్ చేసుకోవడం, ఇవన్నీ ఇల్లుకనిపెట్టుకుని వుండే నాలాంటి వాళ్ల పనులే!

జరుగుతున్న తతంగాన్ని మరోమారు తిరగతోడుకుంటూ మా వైదేహి మరో హెచ్చరిక నన్ను వర్తమానంలోకి లాగింది.

'చూడు నాన్నా....నేనేదో చెబుతుంటే నువ్వేదో నీ లోకంలోకి వెళ్లిపోతున్నావ్. ఇలాంటిది ఇదివ

రకు లేదే... ఏమైంది నీకు? ఎందుకో ఈ మధ్య మరీ స్తబ్ధుగా తయారయ్యావు. మురళికి ఫీజు కట్టమని డబ్బు కాగితాలు ఇస్తే అలా అలమారలోనే వదిలేశావు. నువ్వు చేసి పెట్టలేదని కాదు సుమా ఇలా చెప్పడం. ఈ వయసులో నీ చేత చేయించుకుంటున్నందుకే మేం సిగ్గుపడాలి....' అని చెపుతుంటే 'ఇక ఆపుతావా, నాకేమైందని?' అని అడ్డుకోబోతే అది ఆగలేదు.

'ఏమో ఏమైందో నీకే తెలియాలి. ఈ నెల నువ్వు చేయించుకున్న మెడికల్ చెకప్‌లో కూడా అంతా నార్మల్ అని వచ్చింది. అలా అని ఊరుకుంటామా? ఫర్దర్ టెస్టులు చేయించుకోవాలి. ఏమైనా ఈ రోజు మొదలు ఇంటి పనులేవీ నువ్వు కల్పించుకోకు. ఇరవై నాలుగ్గంటలూ ఇంటి పట్టున వుండి అన్ని పనులు చేసిపెట్టే మనిషినొకదాన్ని మాట్లాడుతున్నాను. వింటున్నావా? సాయంకాలాలు గుడికి వెళ్లి రావడం, తప్పిస్తే ఇంట్లోనే రెస్టు తీసుకో...సరేనా?'

ప్రేమగా దాని భుజం మీద చెయ్యి వేసి నిమిరాను. ఆత్మీయత అంటే ఏమిటో అర్థమయింది. అయితే నాకు అర్థం కానిది నాలో వచ్చిన మార్పేమిటని?దగ్గరుండి నన్ను ప్రేమతో పరిశీలిస్తున్న కూతురి మాట ఎలా కాదనను! నాలో చురుకుదనం తగ్గి మతిమరుపు పెరుగుతోందని రుజువు అవుతుంటే చూస్తూ ఎలా ఊరుకోను? దీనికేమిటి మందు?

ఇదిలా వుండగా మా ఫ్లూటో కూడా ఈ మధ్య డల్‌గా తయారవుతోంది. అదెందుకో! దాని చూస్తే మీ వీధి అంతా హడలిపోయేది. ఆ వీధికి చివరది మా ఇల్లు. అయినా ఇన్నేళ్ల పాటు పూచికపుల్ల పోలేదంటే జీతం లేని సెక్యూరిటీ గార్డు మా ఫ్లూటీయే కారణం. అలాంటిదిప్పుడు గేటు చప్పుడైతే తలెత్తి చూసి ఇటు తిరిగి పడుకుంటోంది గాని ఆఘమేఘాల మీద వెళ్లి ఎటాక్ చేయడం లేదు. ఏం వచ్చిందో దీనికి అని కలతపడ్డాం.

''ఇంకేముంది? వృద్ధాప్య లక్షణం! కుక్కల జీవన ప్రమాణాన్ని అనుసరించి మనకి ఒక ఏడాదయితే దానికి పన్నెండేళ్లతో సమానమంటారు. నెలల పిల్లగా మేం తెచ్చాం. చూస్తుండగా అయిదున్నర ఏళ్లయిపోయింది. అంటే దాని వయస్సు ఇప్పుడు అరవై అయిదు. ఇంకెక్కడి చురుకుదనం!''

అని మా అల్లుడు కొట్టిపారేశాడు. ఏమో, అదలా వుండడం నాకేం బాగాలేదు. ఏదో కాస్త మెతకగా వుందన్న మాట నిజమే కావచ్చు కాని పైకి పెద్దగా రోగలక్షణాలేవి కనిపించడం లేదే! నోరులేని జీవి, పాపం దాని మనసులో ఏముందో! వెంటనే వెటరినరీ హాస్పిటల్‌కి తీసుకెళ్లాను.

పశువుల డాక్టరు రఘుపతి నాకంటే అయిదేళ్లు చిన్న. అంటే ఏభై అయిదు. అతను ఆ శాస్త్రంలో స్పెషల్ స్టడీ చేసినవాడు. పైగా ఫ్లూటీ మీద నే చూపించే శ్రద్ధ మెచ్చుకుంటూ ఎప్పుడూ ప్రత్యేకించి చూస్తాడు. ఫ్లూటీ గురించి నేను మెయిన్‌టెయిన్ చేస్తున్న చిన్న నోట్ బుక్కులోని ఎంట్రీలు చూపించాను. ఆరు నెలల కిందటి ఎంట్రీ, దాని కింద నా ఇనిషియలూ నాకే చూపిస్తూ ఇలా అన్నాడు.

'అప్పుడే నేను చెప్పాను. మూడునెలలకోసారి క్రాస్ చేయించడం అవసరమనీ. మీరు నెగ్లెక్ట్ చేశారు. పోన్లెండి, అయిందేదో అయింది. చేసిన తప్పు దిద్దుకుందాం. ఆ బెంచీ మీద ఓ అరగంట వెయిట్ చేయండి. ఆరోగ్యకరమైన ఆడకుక్కని జత చేసి దానికా ఏర్పాట్లు పూర్తి చేయిస్తాను.' అంటూ ప్యూన్‌ని పిలిచి వాడికా గొలుసు అందించి, ఏం చెయ్యాలో సూచనలు ఇచ్చాడు.

నా ముందు నుంచి మా ఫ్లూటో కదిలింది కాని, దాన్తో పోల్చుకున్న నా ఆలోచనలు నన్ను వదల్లేదు. నేనూ ఇటీవల ఇలా మందకొడిగా తయారవడానికి సెక్స్ స్టార్వేషనే కారణం కాదుకదా అనుకొని నాలిక కరుచుకున్నాను. పచ్చిగా అనిపించవచ్చుగాని జీవశక్తి కారకాలేవో నిక్కచ్చిగా పోల్చుకోవడానికి మొహమాటం దేనికి? ఆహార నిద్ర మైథునాలనే జీవ లక్షణాలలో మొదటి రెండూ పుట్టుకతోనూ, మూడోది యవ్వనంతోనూ మొదలై చచ్చేదాకా జీవిని పట్టుకు కొనసాగుతాయి. జతకూడాలనే ఈ సహజ జీవలక్షణం వయసుతో సంబంధం లేనిది. ఆరోగ్యానికి అత్యవసరమైనది.

నా చెవుల్లో హోరు. మా ఇంటి గేటుకి ఇటు వైపు మా ఫ్లూటో. మరో వైపు ఓ ఆడకుక్కా వేసుకునే విరహపు విజిల్సు ఇప్పుడు వినబడుతున్నట్లుయింది. అంతేకాదు. నేను నెగ్లెక్ట్ చేసిన ఒకానొక శృంగార సంకేతం నా మనోదృశ్యం ముందు కదలాడింది.

దృశ్యం మా భోజనాల గది. మురళిని తీసుకొని మావాళ్లు ఫస్టుషో సినిమాకి వెళ్లిపోయారు. గదిలో ఓ మూల కుర్చీలో తలనొప్పిగా వుందని కూచున్నాను.

'ఇలా ఈ స్టూలు మీదకి రండి. తలపడతాను' అని కామేశ్వరమ్మ పిలిచింది. 'ఇంత పెద్ద వెలుగు కళ్లల్లో పడుతుంటే తలనొప్పి ఎక్కువవదూ!' అంటూ ఆ గదిలో లైటు ఆర్పేసింది. వెనక నుంచైనా ఒళ్లంతా తగలడానికి కాకపోతే కుర్చీ మీంచి స్టూలు మీదకి ఏ ఉద్దేశంతో ఆహ్వానించిందో, లైటు కూడా ఆఫ్ చెయ్యమని ఎందుకు సూచించిందో ఎరగనంత సన్నాసినా నేను! అంతగా ఆవిడ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా, తెలిసి చలించకుండా ఇవతలి గదిలోకి వెళ్లి తలుపేసుకున్న ఈ మొద్దుని ఏమనుకోవాలి! పాకశాస్త్రంతో పాటు 'విషయ' పరిపాక జ్ఞానం వంటబట్టిన మనిషి చేరువలో ఉండడం ఎంత అదృష్టం! చేసిన తప్పు దిద్దుకునే ప్రయత్నం ఈ రాత్రే మొదలుపెట్టకపోతే నేను మళ్లీ మెరుగ్గా తయారేది ఎలా?

కుంటుతూ కునుకుతూ లోపలికెళ్లిన మా ఫ్లూటో కులుకుతూ గెంతుతూ ఇవతలికి రావడం చూసి కృతజ్ఞతతో దాన్ని నిమిరాను. బద్ధకమంతా పోయినట్లు అదొకసారి ఒళ్లంతా విదిలించుకుంది. అది చూసి నా సర్వసంకోచాలు పోయాయి. ఉత్సాహ ఉద్రేకాలు మళ్లీ ఊపిరందుకున్నాయి!

★

## వైరంకాదు.... స్నేహం

నిప్పు-ఉప్పు, అత్త-కోడలు, కంద-కత్తిపీట...ఇవన్నీ వైరానికి ప్రతీకలు. మరి పిల్లి, ఎలుక వైరం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పిల్లికి చెలగాటం-ఎలుకకి ప్రాణ సంకటం అంటారు. అయితే ఈ వైరం అన్నివేళలా ఉండదని చాటుతున్నాయి ఓ మార్జాలం, ఓ మూషికం. బొగోటాలో ఈమధ్య ఓ తెల్ల ఎలుక, నల్లపిల్లి బ్లాక్ అండ్ వైట్ టీవీలా కలిసి మెలిసి తిరుగుతూ కన్పించాయి. వైరం జనం పుణ్యమే కానీ తామెప్పుడూ కలిసే ఉంటామని చెబుతున్నాయి. జీవవైవిధ్యానికి ఇంతకు మించిన తార్కాణాలు ఇంకేమైనా కావాలా?

